# రహస్యం

## పెమ్మరాజు రామకృష్ణ



దీక్షితులుగారు సిటీలో పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఆయన చేయని బిజినెస్ లేదు. బిల్డింగ్స్, కాంట్రాక్ట్, థియేటర్స్ - ఒక టేమిటి ఆయనకు లేని బిజినెస్ లేదు. ఆయన పట్టిందంతా బంగారమని అంటా రందరూ. నేను బాంక్‌లో పని చేస్తూండటంతో మా కస్టమర్స్ ఆయన ఇచ్చిన చెక్కులు పట్టుకొస్తూంటారు. ఆయన గురించి గొప్పగా చెబుతూంటారు. ఆయన ఆఫీస్ రూమ్ చాలా బావుంటుందని, ఆయన ప్రైవేట్ రూమ్‌కి ఎవరినీ రానీరని చెబుతారు. ఎలాగైనా దీక్షితులుగారిని కలిసి ఆయనతో పరిచయం చేసుకోవా లనిపించింది నాకు.

ఒక రోజు ఆయనకు ఫోన్ చేశాను. నేను బాంక్‌లో పని చేస్తున్నానని, ఆయనను ఒకసారి కలవాలని చెప్పాను. అలాగే అని సాయంత్రం ఆరింటికి ఆఫీస్‌కు రమ్మని ఫోన్ పెట్టేశారు.

ఆరింటికి ఆఫీస్‌కు వెళ్ళి విజిటింగ్ కార్డ్ లోపలికి పంపాను. "అయ్యగారు రమ్మంటున్నారు" అని ఆఫీస్ బాయ్ చెప్పాడు.

ఆఫీస్ రూమ్ చాలా విశాలంగా ఉంది. టేబుల్ గ్లాస్ కింద రకరకాల దేముడి ఫోటో లున్నాయి. చల్లని ఏ.సీ. గది ఆహ్లాదంగా ఉంది. కిటికీలకు అందమైన కర్టెన్స్, గోడలకు చక్కని సీనరీలు ఉన్నాయి. అందమైన క్రోటన్ మొక్కలు గది అందాన్ని మరింత పెంచాయి.

"మీ గురించి విన్నాను. మీరు మా బాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేయాలి" అన్నాను.

"ఆల్ రెడీ మాకు చాలా బ్యాంక్స్‌లో అకౌంట్స్ ఉన్నాయే" అన్నారు.

"మీరు ఏదైనా కొత్త బిజినెస్ స్టార్ట్ చేసినప్పుడు ఆ అకౌంట్ మా కివ్వండి" అన్నాను.

"అలాగే చూద్దాం" అన్నారు దీక్షితులుగారు. ఆయనతో మాట్లాతున్నానే కానీ నా కళ్ళన్నీ నల్లటి ఉడ్ పేనల్ డోర్‌మీద 'ప్రైవేట్' అని రాసున్న గదివైపే ఉన్నాయి. ఆఫీస్ రూమ్ ఇంత అందంగా ఉంటే లోపల ఆయన ప్రైవేట్ రూమ్ ఇంకెంత అందంగా ఉంటుందోనని ఊహించుకోసాగాను. నే కట్టబోయే ఇల్లు అలా కట్టుకోవాలని నా ఉద్దేశం. మొదటిసారే ఆయన రూమ్ చూపించమంటే బావుండదని వచ్చేశాను.

** ** **

అలా ఆయనతో పరిచయం పెంచుకుని ఆఖరికి ఒక రోజు నా మనసులో కోరిక బయటపెట్టాను.

"అది నా పర్సనల్ రూమ్. ఇంతవరకు ఎవరికీ చూపించలేదు" అన్నారు దీక్షితులుగారు దృఢంగా.

"మీరు ఏమీ అనుకోకపోతేనే..." అని నీళ్ళు నమిలాను. నిజానికి నాలో చూడాలనే కోరిక మరింత అధికమైంది.

"సరే, రండి" అని లేచి రూమ్‌వైపు దారి తీశారు. అనుసరించాను నేను.

ఆశ్చర్యం, సంభ్రమం ఒకేసారి కలిగాయి నాకు. నా ఊహకు, ఆలోచనలకు భిన్నంగా ఉంది ఆ గది. ఒక చాప, తలగడా, గది మూల కూజా, దానిమీద గ్లాను బోర్లించి ఉన్నాయి. నోట మాట రాలేదు నాకు.

దీక్షితులుగారు చెప్పడం మొదలుపెట్టారు.

"నేను ఎక్కువగా చదువుకోలేదు. ఒక కాంట్రాక్టరు దగ్గర తక్కువ జీతనికి పని చేసేవాడిని. అప్పుడు ఒక గదిలో అద్దెకు ఉండేవాడిని. ఈ ఆస్తి అప్పటిదే. ఒక ముఖ్యమైన టెండర్ నా పేరున పెడితే అది కోట్ అయింది. దాంట్లో లాభాలు బాగా వచ్చాయి. అప్పటినుంచి ఆయన నన్ను పార్టనర్‌గా చేర్చుకున్నారు. నా కృషికి పట్టుదల, అదృష్టం తోడయింది. తరువాత ఆయన కొడుకులు పెద్దవా ళ్ళయ్యాక నేను ఇవతలకి వచ్చేశాను. 'ఆయనే ఈయన' అంటూ దండ వేసున్న ఫోటో చూపించారు. 'చెప్పద్దూ... ఏ.సీ. రూమ్‌లో కన్నా ఈ చాపమీద పడుకుంటే నాకు నిద్ర బాగా పడుతుంది" అన్నారు" - చిద్విలాసంగా. "ఈ గది నా గతం. నా గతం నన్ను వర్తమానంలో జాగ్రత్తగా నడిపించి భవిష్యత్తుకు బాట వేసింది" అని అన్నారు.

ఆయన చెప్పిందంత శ్రద్ధగా విన్నాను. ఆయన ఏదో మహత్తర సందేశం ఇచ్చినట్లయింది నాకు. ★